RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in

# దేశ టైమ్స్
DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | సెప్టెంబర్ 12 శనివారం 2026 | సంపుటి : 16 | సంచిక : 219 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష
NALGONDA | SATURDAY SEPTEMBER 12 2026 | VOL:16 | ISSUE: 219 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:SAYED PASHA

# ఫాంహౌస్‌లో కేసీఆర్ కుట్ర.. మహిళా అధికారుల ముందు అభ్యంతరకరంగా వ్యవహరించారు: రేవంత్ రెడ్డి

- శాసనసభ సజావుగా జరగకుండా కేసీఆర్ ఫాంహౌస్‌లోనే కుట్రలు జరిగాయన్న రేవంత్ రెడ్డి
- ప్రజాప్రతినిధులను, పోలీసులను దూషిస్తూ మూడు రోజులు సభను అడ్డుకున్నారని మండిపాటు
- బీఆర్ఎస్ కుట్రలను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమర్థవంతంగా తిప్పికొట్టారని ప్రశంస



శాసనసభను సజావుగా సాగనివ్వకుండా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఆయన ఫాంహౌస్‌లోనే కుట్రలు పన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అధికారం పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నాయకులు పోలీసు అధికారులను, ప్రజాప్రతినిధులను దూషిస్తూ మూడు రోజుల పాటు సభాకార్యక్రమాలను అడ్డుకున్నారని మండిపడ్డారు. ఈరోజు నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశంలో ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘ ప్రసంగం చేశారు.సభలో అధికారులపై అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, సభాపతిని అత్యంత తీవ్ర పదజాలంతో దూషించారని, మహిళా అధికారుల ముందే టీషర్టులు విప్పి అభ్యంతరకరంగా నిరసన తెలపడం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల దిగజారుడుతనానికి నిదర్శనమని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన దళితులు నడిచిన నేలను బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేసి దళితులను ఘోరంగా అవమానించారని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుండి జరిగిన ఈ అవాంఛనీయ ఘటనలన్నింటిపై ప్రభుత్వం తరఫున సమగ్ర విచారణకు ఆదేశించామని వెల్లడించారు. బీఆర్ఎస్ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.కాంగ్రెస్ పార్టీ ద్వారానే రాజకీయంగా ఎదిగిన సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి లాంటి నాయకులు ఇప్పుడు అదే పార్టీకి నష్టం చేయాలని చూడటం దారుణమని సీఎం అన్నారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోయి ఉంటే వారు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీస్ సిబ్బందిలో కూడా కేటీఆర్‌కు తన రూపమే కనిపిస్తున్నట్టుందని, అందుకే అధికారులపై అంత ఆక్రోశంతో దాడులకు తెగబడుతున్నారని ఎద్దేవా చేశారు.పాలనాపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల మైలురాయిని పూర్తి చేసుకున్న సందర్భంగా, చేపట్టిన సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఎం వివరించారు. చారిత్రక భవనంలో శాసన మండలిని పునఃప్రారంభించుకోవడమే కాకుండా, అసెంబ్లీలోని సెంట్రల్ హాల్‌ను ప్రారంభించి మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని, కేంద్రం చేపట్టబోయే జనాభా లెక్కల్లోనూ ఈ తెలంగాణ నమూనాను అమలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో 'ఎస్ఐఆర్' పేరుతో లక్షలాది ఓట్లను తొలగించే పెద్ద కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా ఉంటే, ఓటర్ల జాబితాలో మాత్రం కేవలం 88 కోట్లే చూపిస్తున్నారని, అంటే దాదాపు 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని వివరించారు. ఎమ్మెల్యేగా మళ్లీ గెలవాలనుకునే ప్రతీ ఒక్కరూ తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కు పరిరక్షణను అత్యంత తీవ్రంగా పరిగణించాలని నిర్దేశించారు. శాసనసభ చర్చల్లో క్రమం తప్పకుండా పాల్గొనాలని, హాజరు శాతాన్ని కాపాడుకుంటూ స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం: ప్రధాని మోదీ

- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత ముఖ్యం
- సముద్ర వాణిజ్యానికి పెరుగుతున్న అంతరాయాలపై ప్రధాని మోదీ ఆందోళన
- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పెరిగిందన్న ప్రధాని
- బ్రిక్స్ దేశాల మధ్య పెట్టుబడులు, భాగస్వామ్యం పెరగాలని పిలుపు

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో సముద్ర వాణిజ్యానికి, సరఫరా వ్యవస్థలకు (సప్లై చైన్స్) ఎదురవుతున్న అంతరాయాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సురక్షితమైన, పటిష్ఠమైన సరఫరా గొలుసులకు,




(మిగతా 2వ పేజీలో..)

## ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు: హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

- వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు
- సెప్టెంబర్ 12 నుంచి 24వ తేదీ వరకు ఆంక్షలు అమలు
- ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు మళ్లింపులు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని నగర పోలీసుల సూచన

హైదరాబాద్‌లో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో నగర ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రకటన విడుదల చేశారు.

(మిగతా 2వ పేజీలో..)



## ఢిల్లీ నుంచి అగ్రదేశాలకు పుతిన్ సవాల్.. 'బ్రిక్స్' బలమెంతో చెప్పిన రష్యా అధ్యక్షుడు!

- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ వాటా 40 శాతానికి పైగా ఉందన్న పుతిన్
- జీ7 వాటా 29 శాతమేనని వెల్లడి
- ఐదేళ్ల ప్రపంచ వృద్ధిలో బ్రిక్స్ వాటా సగానికి పైగానే ఉందని వెల్లడి
- జీ7 వృద్ధి వాటా 18 శాతంగా ఉందని ప్రస్తావన
- బ్రిక్స్ కోసం కొత్త పెట్టుబడి వేదిక ఏర్పాటుకు పుతిన్ ప్రతిపాదన

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం వేగంగా పెరుగుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పైగా ఉందని చెప్పారు. జీ7 దేశాల వాటా 29 శాతమేనని తెలిపారు.న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరం'లో పుతిన్ మాట్లాడారు. గత ఐదేళ్ల గణాంకాలను ఆయన ప్రస్తావించారు. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో సగానికి పైగా బ్రిక్స్ దేశాల నుంచే వచ్చిందన్నారు. అదే సమయంలో జీ7 దేశాల వాటా 18 శాతంగా ఉందని చెప్పారు.బ్రిక్స్ ఎదుగుదలను పాశ్చాత్య దేశాలు గమనిస్తున్నాయని పుతిన్ అన్నారు. తమ పోటీ

(మిగతా 2వ పేజీలో..)



## మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ.. తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు

- మూసీ ప్రాజెక్టుపై ఎన్జీటీలో కొత్త పిటిషన్
- తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ
- 55 కి.మీ.లో 20 కి.మీ. అధ్యయనంపై ప్రశ్నలు
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నిర్మాణాలపై అభ్యంతరం



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించి

(మిగతా 2వ పేజీలో..)

## రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది: ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు

- బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి చేశారన్న సబిత
- ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉంటుందని వ్యాఖ్య
- తోపులాటలో జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని ఆవేదన

తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలు దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభను తలపించాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు




(మిగతా 2వ పేజీలో..)

## రేవంత్ సీఎం అవడం.. వీరప్పన్ మంత్రి అయినట్లే: కేటీఆర్

- వీరప్పన్ మంత్రి అయితే ఎలా ఉంటుందో, రేవంత్ సీఎం కావడం అలాగే ఉందన్న కేటీఆర్
- సీఎం కాకముందు ఆర్టీఐతో బ్లాక్‌మెయిల్ చేసి బతికారని ఆరోపణ
- హైదరాబాద్ చుట్టూ వేల ఎకరాల భూములపై సీఎం కన్ను పడిందన్న మాజీ మంత్రి
- భూదందాల వల్లే రేవంత్ రాజీనామా చేయాల్సి వస్తుందని జోస్యం
- రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్న కేటీఆర్

సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్



RNI NO. TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## సంపాదకీయం

# నీటి పొదుపు.. భవిష్యత్తుకు భరోసా!

భూమిపై జీవరాశికి అత్యంత అవసరమైన సహజ వనరుల్లో నీరు ప్రధానమైనది. మనిషి ఆహారం లేక కొన్ని రోజులు జీవించగలడేమో కానీ.. నీరు లేకుండా జీవించడం సాధ్యం కాదు. అయినప్పటికీ నీటి విలువను గుర్తించడంలో మనం తరచూ నిర్లక్ష్యం చేస్తున్నాం. జనాభా పెరుగుదల, పట్టణీకరణ, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల అధిక వినియోగం కారణంగా భవిష్యత్తులో నీటి కొరత మరింత తీవ్రమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో నీటి సంరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు.. ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా మారాలి.

**పెరుగుతున్న అవసరాలు.. తగ్గుతున్న వనరులు**

ప్రస్తుతం నగరాలు, పట్టణాలు వేగంగా విస్తరిస్తున్నాయి. కొత్త నివాస ప్రాంతాలు, పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు పెరుగుతున్న కొద్దీ నీటి అవసరం కూడా అధికమవుతోంది. ఒకప్పుడు బావులు, చెరువులు, కుంటలు, కాలువలు గ్రామీణ జీవనానికి ఆధారంగా ఉండేవి. ఇప్పుడు వాటిలో అనేకం ఆక్రమణలకు గురవడం, పూడుకుపోవడం, కాలుష్యానికి గురికావడం వల్ల వాటి సామర్థ్యం తగ్గుతోంది.మరోవైపు భూగర్భ జలాలపై ఆధారపడటం పెరిగింది. వర్షపాతం సక్రమంగా లేకపోయినా బోర్లు వేసి నీటిని తోడేస్తున్నాం. భూగర్భ జలాలు తిరిగి భర్తీ కావడానికి సమయం పడుతుందన్న విషయాన్ని విస్మరిస్తున్నాం. ఫలితంగా అనేక ప్రాంతాల్లో నీటి మట్టాలు క్రమంగా పడిపోతున్నాయి.

**వర్షపు నీటిని ఒడిసిపట్టాలి**

వర్షం రూపంలో ప్రకృతి మనకు అందించే నీటిని సాధ్యమైనంత వరకు భూమిలోకి ఇంకేలా చేయాలి. పట్టణాల్లో కాంక్రీట్ నిర్మాణాలు పెరగడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా నేరుగా డ్రైనేజీల ద్వారా బయటకు వెళ్లిపోతోంది. ఒకవైపు వర్షాలు పడినప్పుడు వరదలు వస్తున్నాయి.. మరోవైపు వేసవి వచ్చే సరికి నీటి కొరత ఏర్పడుతోంది. ఈ పరిస్థితికి వర్షపు నీటి సంరక్షణ ఒక ముఖ్యమైన పరిష్కారం. ప్రతి ఇంటిలో, ప్రభుత్వ కార్యాలయంలో, పాఠశాలలో, అపార్ట్‌మెంట్లలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ప్రోత్సహించాలి. రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్, రీచార్జ్ పిట్స్, ఇంకుడు గుంతలను విస్తృతంగా ఏర్పాటు చేయాలి. వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పెంచడం ద్వారా భవిష్యత్ అవసరాలను కొంతమేర తీర్చుకోవచ్చు.

**చెరువుల పరిరక్షణ అత్యవసరం**

చెరువులు కేవలం నీటి నిల్వ ప్రాంతాలు కావు. అవి భూగర్భ జలాలను పెంచే సహజ వనరులు. వ్యవసాయానికి, పశుపోషణకు, స్థానిక జీవవైవిధ్యానికి కూడా అవి ఎంతో కీలకం. కానీ అనేక ప్రాంతాల్లో చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. కొన్ని చెరువులు మురుగునీటి నిల్వ కేంద్రాలుగా మారుతున్నాయి. చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ఆక్రమణలను తొలగించడంతో పాటు పూడికతీత, కట్టల బలోపేతం, నీటి ప్రవాహ మార్గాల పునరుద్ధరణ వంటి పనులు నిరంతరం చేపట్టాలి. ఒకసారి పనులు చేసి వదిలేయకుండా.. వాటి నిర్వహణకు శాశ్వత వ్యవస్థ ఉండాలి.

**వ్యవసాయంలో నీటి వినియోగంపై మార్పు అవసరం**

మన దేశంలో నీటి వినియోగంలో వ్యవసాయ రంగానిదే పెద్ద వాటా. సంప్రదాయ పద్ధతుల్లో అధికంగా నీటిని వినియోగించే పంటల స్థానంలో ప్రాంతానికి, నేల స్వభావానికి అనుగుణమైన పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను మరింత విస్తృతం చేయాలి. రైతులకు కేవలం సాగునీరు అందించడం మాత్రమే కాకుండా.. అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా ఎలా వినియోగించాలో కూడా అవగాహన కల్పించాలి. తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించే పద్ధతులను ప్రోత్సహిస్తే వ్యవసాయ రంగంపై నీటి ఒత్తిడి తగ్గుతుంది.

పట్టణాల్లో వృథాను అరికట్టాలి ఇళ్లలో నీటి వృథా చాలా సందర్భాల్లో మనకు తెలియకుండానే జరుగుతుంది. అవసరానికి మించి కుళాయిలు తెరిచి ఉంచడం, లీకేజీలను సకాలంలో మరమ్మతు చేయకపోవడం, వాహనాలను అధిక నీటితో శుభ్రం చేయడం వంటి చిన్న చిన్న అలవాట్లు కలిపితే భారీగా నీరు వృథా అవుతుంది. అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, పరిశ్రమల్లో నీటి వినియోగాన్ని పర్యవేక్షించే వ్యవస్థలు ఉండాలి. శుద్ధి చేసిన మురుగునీటిని సాధ్యమైన చోట్ల తోటల నిర్వహణ, పారిశ్రామిక అవసరాలు, ఇతర పనులకు తిరిగి వినియోగించే విధానాలను ప్రోత్సహించాలి.

**నీటికి విలువ తెలియాలంటే అవగాహన అవసరం**

నీటి సంరక్షణపై పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలి. నీరు ఎక్కడి నుంచి వస్తుంది? అది ఎలా శుద్ధి అవుతుంది? మన ఇంటికి చేరేందుకు ఎంత శ్రమ, ఖర్చు అవుతుంది? అనే విషయాలను విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పాలి.పిల్లల్లో ఏర్పడే మంచి అలవాట్లు కుటుంబాలకూ, సమాజానికీ విస్తరిస్తాయి. పాఠశాలల్లో నీటి సంరక్షణ క్లబ్బులు ఏర్పాటు చేసి విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించవచ్చు. స్థానిక చెరువులు, కాలువలు, నీటి వనరుల పరిరక్షణలో యువతను భాగస్వాములను చేయాలి.నీటి సమస్యకు రాజకీయాలకు అతీతమైన పరిష్కారం కావాలినీటి వనరుల విషయంలో దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. ప్రభుత్వాలు మారినా నీటి సంరక్షణ విధానాలు మారకూడదు. ఒక ప్రాంతంలో నీటి సమస్యను పరిష్కరించేందుకు తాత్కాలికంగా ట్యాంకర్లను పంపడం అవసరం కావచ్చు. కానీ అదే సమయంలో శాశ్వత నీటి వనరుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. పట్టణ ప్రణాళికలోనే నీటి వనరులకు ప్రత్యేక స్థానం కల్పించాలి. కొత్తగా ఏర్పడే కాలనీల్లో వర్షపు నీటి సంరక్షణ తప్పనిసరి చేయడం, చెరువుల చుట్టూ బఫర్ జోన్లను కాపాడటం, సహజ నీటి ప్రవాహ మార్గాలను పరిరక్షించడం వంటి చర్యలు కచ్చితంగా అమలు కావాలి.

**ప్రతి చుక్కా విలువైనదే**

నీటి కొరత అనేది ఒక్కరోజులో ఏర్పడే సమస్య కాదు. అలాగే ఒక్కరోజులో పరిష్కరించగల సమస్య కూడా కాదు. ఇది దీర్ఘకాలిక సవాలు. ప్రభుత్వం, స్థానిక సంస్థలు, రైతులు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రజలు.. ఇలా ప్రతి వర్గం కలిసి పనిచేసినప్పుడే ఫలితం ఉంటుంది.మనకు అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించడం, వర్షపు నీటిని సంరక్షించడం, చెరువులను కాపాడడం, భూగర్భ జలాలను పెంచడం, నీటి వృథాను అరికట్టడం వంటి చర్యలు ఇప్పటి నుంచే ప్రారంభించాలి.ఈరోజు మనం వృథా చేసే ప్రతి చుక్క.. రేపటి తరానికి కొరతగా మారవచ్చు. ఈరోజు మనం కాపాడే ప్రతి చుక్క.. రేపటి తరానికి జీవనాధారంగా నిలవొచ్చు. నీటిని పొదుపు చేయడం అంటే కేవలం ఒక వనరును కాపాడటం కాదు.. భవిష్యత్ తరాల జీవితాన్ని కాపాడటం.

# రేవంత్ సీఎం అవడం.. వీరప్పన్ మంత్రి అయినట్లే: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

అటవీ శాఖ మంత్రి అయితే ఎలా ఉంటుందో, భూ దందాలు చేసే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం కూడా అలాగే ఉందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ సర్కార్ తీరుపై తీవ్ర ఆరోపణలు చేశారు.సీఎం కాకముందు రేవంత్ రెడ్డి ఆర్టీఐని అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేసి బతికేవారని, అలాంటి వ్యక్తి ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఒక ముఠాను ఏర్పాటు చేసి, వారి కనుసన్నల్లో 22ఏ భూ దందా నడిపిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తెచ్చే ప్రతి స్కీం వెనుక ఒక స్కాం ఉందని, హిల్ట్ పాలసీ, మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ పేర్లతో వేల ఎకరాల భూములను కాజేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేసి భూదందాలకు తెరలేపారని దుయ్యబట్టారు.కేసీఆర్ హయాంలో ఫాక్స్‌కాన్ వచ్చిన కొంగరకలాన్ భూములపై రేవంత్ కన్ను పడిందని, అక్కడ రూ.వెయ్యి కోట్ల కుంభకోణానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌లో వేలిముద్ర లేకుండా ఇంచు భూమి కూడా మార్చలేరని, కానీ ఇప్పుడు భూభారతితో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతోందని విమర్శించారు. భూములను కాపాడాల్సిన కాపలాదారులే కబ్జాదారులుగా మారారని అన్నారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భూదోపిడీ జరుగుతోందని, ఈ వ్యవహారాలతో రేవంత్ రెడ్డి త్వరలోనే రాజీనామా చేయాల్సి వస్తుందని కేటీఆర్ జోస్యం చెప్పారు. మరో రెండేళ్లలో కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది: ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు

మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్షాలకు ఉంటుందని, అయితే 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదని, మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగడమే కాకుండా, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారని ఆరోపించారు. ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం వంటివన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోవడం వల్లే తాము ఢిల్లీకి వచ్చి జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను అడ్డుపెట్టుకుని 'శిఖండి రాజకీయాలు' చేస్తోందని ధ్వజమెత్తారు. 22ఏ పేరుతో కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి భారీ భూదందాకు తెరలేపారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈ దాడుల ఘటనలపై సమగ్ర లేఖలు రాస్తున్నామని, కాంగ్రెస్ నాయకత్వం దీనిపై వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

## ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు: హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

మొదటి పేజీ తరువాయి)

ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 12 నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 13 రోజుల పాటు రోజూ ఉదయం 11 గంటల నుంచి భక్తుల రద్దీని బట్టి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు.

**ప్రధాన మళ్లింపులు ఇవే:**

పోలీసులు ప్రకటన ప్రకారం, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి బడా గణేష్ వైపు వచ్చే వాహనాలను ఇక్బాల్ మినార్ మీదుగా మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు వెళ్లే వాహనాలు సచివాలయం ఎక్స్ రోడ్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదేవిధంగా, నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను సచివాలయం జంక్షన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా అనుమతిస్తారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వచ్చే వాహనాలను పాత సైఫాబాద్ పీఎస్ జంక్షన్ మీదుగా మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**భక్తులకు పార్కింగ్ సౌకర్యాలు:**

గణపతి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఖైరతాబాద్ జంక్షన్ నుంచి వచ్చే భక్తుల కోసం విశ్వేశ్వరయ్య భవన్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వాహనదారులు రద్దీగా ఉండే మార్గాలకు బదులుగా ప్రత్యామ్నాయ రహదారులను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం 90102 03626 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## కాంగ్రెస్‌లో భారీ మార్పులు.. రంగంలోకి రాహుల్ గాంధీ

2029 లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత మార్పులకు అగ్ర నాయకత్వం శ్రీకారం చుట్టింది. ఏఐసీసీ జాతీయ కార్యదర్శుల నియామకాల కోసం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ప్రియాంకా గాంధీ వాద్రాతో కలిసి ఆయన ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.ఢిల్లీలోని 10 జన్‌పథ్‌లో సోమవారం నుంచి ఈ ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. దాదాపు 120 మంది నేతలను ఇందుకు ఎంపిక చేశారు. గ్రూపులుగా విభజించి ఒకేసారి 10 మందిని రాహుల్ గాంధీ ఇంటర్వ్యూ చేస్తున్నారు. అభ్యర్థుల ప్రొఫైల్, గతంలో చేసిన పనులు, రాజకీయ దృక్పథంపై రాహుల్ ప్రశ్నలు అడుగుతుండగా, ప్రియాంకా గాంధీ మరిన్ని వివరాలు రాబడుతున్నారు. ఈ నియామకాల్లో యువతకు, 'సంగఠన్ సృజన్' కార్యక్రమంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత జాతీయ కార్యదర్శుల్లో 60 శాతానికి పైగా మార్పులు తప్పవని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.మరోవైపు, పార్టీలో మరిన్ని కీలక మార్పులు జరగవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. త్వరలో ఎన్నికల నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసి, దానికి ప్రియాంకా గాంధీని చైర్‌పర్సన్‌గా నియమించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అలాగే, వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరగనున్న ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పదవీ విరమణ చేయవచ్చని, ఆయన స్థానంలో కేసీ వేణుగోపాల్‌ను నియమించవచ్చని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే, అక్టోబర్ చివరి నాటికి జిల్లా అధ్యక్షుల నియామకాలు పూర్తి చేస్తామని కేసీ వేణుగోపాల్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ మార్పుల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మార్పుపైనా చర్చ జరుగుతోంది. ప్రస్తుత ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాలనుకుంటున్నారని, దీంతో ఆమె స్థానంలో కొత్తవారిని నియమించవచ్చని కొందరు నేతలు చెబుతున్నారు. అయితే, ప్రస్తుతం ఆమె తన బాధ్యతల్లోనే కొనసాగుతున్నారు. రాష్ట్రంలో పార్టీ సమన్వయం, నామినేటెడ్ పోస్టుల భర్తీ వంటి అంశాలపై దృష్టి సారించారు. మొత్తంగా ఈ మార్పుల ద్వారా 2029 నాటికి పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా అధిష్ఠానం అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.



## మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ.. తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు

మొదటి పేజీ తరువాయి)

పర్యావరణ నిబంధనలు, అనుమతుల్లో లోపాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉంటే.. కేవలం 20 కిలోమీటర్ల మేర మాత్రమే అధ్యయనం చేశారని పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో మృగవాణి జాతీయ పార్కు కూడా ఉందని తెలిపారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిసరాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపైనా రిటైర్డ్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా అభ్యంతరాలు లేవనెత్తారు. ప్రాజెక్టు వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు వాదించారు. పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన వివరాలను ట్రిబ్యునల్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం తన వాదనను కూడా వెల్లడించాల్సి ఉంది. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేసింది. ఇప్పుడు మరో పిటిషన్ దాఖలు కావడంతో ఈ వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై తదుపరి విచారణను ఎన్జీటీ అక్టోబర్ 16కు వాయిదా వేసింది. ఆ విచారణలో పిటిషనర్లు లేవనెత్తిన పర్యావరణ అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు కీలకం కానున్నాయి. ఇప్పటికే మూసీ ప్రక్షాళనను ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఎన్జీటీలో తాజా పరిణామం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం: ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి)

నౌకాయాన స్వేచ్ఛకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్'లో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ కూటమి ప్రాధాన్యం దినదినాభివృద్ధి చెందుతోందని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను బ్రిక్స్ దేశాలు కలిగి ఉన్నాయని వివరించారు. ప్రపంచ జీడీపీ సుమారు 2.5 రెట్లు వృద్ధి చెందగా, బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ ఏకంగా 4.5 రెట్లు పెరిగిందని, ఇది ప్రపంచ సగటు వృద్ధి కన్నా దాదాపు రెట్టింపు అని వెల్లడించారు. బ్రిక్స్ దేశాలు సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారుతున్నాయని ప్రధాని ప్రశంసించారు. ఈ ఆర్థిక శక్తిని ప్రపంచానికి మేలు చేకూర్చే ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం బ్రిక్స్ సభ్య దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు నిర్వహించిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లలో ఇదే అతిపెద్దదని, దీనికి భారత్ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు.

## ఢిల్లీ నుంచి అగ్రదేశాలకు పుతిన్ సవాల్.. 'బ్రిక్స్' బలమెంతో చెప్పిన రష్యా అధ్యక్షుడు!

మొదటి పేజీ తరువాయి)

సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అవి ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ఈ పోటీ కొన్ని సందర్భాల్లో అసహ్యకర స్థాయికి చేరుతోందని వ్యాఖ్యానించారు. బ్రిక్స్ దేశాల కోసం కొత్త పెట్టుబడి వేదికను ఏర్పాటు చేయాలని పుతిన్ ప్రతిపాదించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా దీనిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు సమీకరించేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు.బ్రిక్స్ దేశాలకు భారీ దేశీయ మార్కెట్లు ఉన్నాయని పుతిన్ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం లోతైన మార్పులు జరుగుతున్నాయని చెప్పారు. కొత్త వృద్ధి కేంద్రాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.రష్యాపై 30 వేలకు పైగా ఆంక్షలు ఉన్నాయని పుతిన్ వెల్లడించారు. ప్రపంచం మార్పుల దశలో ఉందని చెప్పారు. ఈ మార్పులు మానవాళి భవిష్యత్తుకు అవసరమని పేర్కొన్నారు.



RNI NO. TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



# హింస, వెట్టిచాకిరి, అణచివేతకు వ్యతిరేకంగా పుట్టిన చైతన్య జ్వాలే తెలంగాణ సాయుధ పోరాటం

**సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవిబాబు**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 11 (దేశ టైమ్స్):**

హింస, వెట్టిచాకిరి, అణచివేతకు వ్యతిరేకంగా పుట్టిన చైతన్య జ్వాలలే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని సీపీఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవిబాబు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మధిరలో సీపీఐ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతాంగ సాయుధ పోరాట యోధుడు, అమరజీవి వాసిరెడ్డి వెంకటపతి స్మారక స్థూపానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారోత్సవాల ప్రారంభ సూచికగా బెజవాడ రవిబాబు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో రవిబాబు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర చారిత్రాత్మకమని కొనియాడారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టు యోధులు ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి పోరాటాన్ని నడిపారని గుర్తుచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గార్ల, బయ్యారం, ఇల్లెందు ప్రాంతాల్లో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయని తెలిపారు. రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజల తిరుగుబాటు మధిర ప్రాంతంలో రజాకార్ల తూటాలకు సుమారు 50 మంది ప్రాణాలు కోల్పోయారని రవిబాబు తెలిపారు. మృతదేహాలను సైతం గ్రామాల్లో ఊరేగిస్తూ రజాకార్లు పైశాచికానందం పొందారని ఆవేదన వ్యక్తం చేశారు. మధిర నియోజకవర్గంలోని అనేక గ్రామాలు నిజాం పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాయని చెప్పారు. మధిర సమీపంలోని అల్లీనగరం గ్రామస్తులు రజాకార్లను తరిమికొట్టారని, దీనికి ప్రతీకారంగా రజాకార్లు భారీ సేనలతో వచ్చి ఇళ్లను తగలబెట్టారని వివరించారు. గోవిందపురంలోనూ ఇలాంటి ఘటన చోటుచేసుకుందని పేర్కొన్నారు. చేతికి దొరికిందే ఆయుధంగా.. రజాకార్ల అరాచకాలతో చితికిపోయిన ప్రజలు కమ్యూనిస్టు నాయకుల పిలుపుతో పోరాటంలోకి అడుగుపెట్టారని రవిబాబు తెలిపారు. పలుగు, పారా, కారం, రోకలి, బరిసెలు.. చేతికి ఏది దొరికితే దానినే ఆయుధంగా మలుచుకుని ఆడ, మగ అనే తేడా లేకుండా ప్రజలు సాయుధులై పోరాడారని అన్నారు. నాటి నిజాం పోలీసులు, రజాకార్లకు కమ్యూనిస్టులు, ఉద్యమకారులు ఎదురొడ్డి నిలిచారని



పేర్కొన్నారు. మధిర ప్రాంతానికి చెందిన నల్లమల గిరిప్రసాద్, వాసిరెడ్డి వెంకటపతి తదితరులు రజాకార్లను ఎదుర్కొని తరిమికొట్టారని గుర్తుచేశారు. ఈ చారిత్రాత్మక పోరాటం ఫలితంగానే పది లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచగలిగామని రవిబాబు అన్నారు. నాలుగు వేల మంది అమరవీరుల బలిదానంతోనే ప్రజలకు విముక్తి లభించిందని తెలిపారు. రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని గుండెల్లో నింపుకుని, నేటి ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ శ్రేణులు సమరశీల పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంఏ రహీం, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి మంగళగిరి రామానుజనం, ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు, రమేష్, నాగకృష్ణ, నాయకర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై కేరళ గ్లోబల్ హై స్కూల్ విద్యార్థుల అవగాహన ర్యాలీ: రుద్రంగి ఎస్ఐ మోతిరామ్





**రుద్రంగి సెప్టెంబర్ 11 (దేశ టైమ్స్)**

రుద్రంగి మండల కేంద్రంలోని కేరళ గ్లోబల్ హై స్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఇందిరా చౌక్ వద్ద ప్లకార్డులు చేతబూని చిన్నారులు వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ మోతిరామ్ మాట్లాడుతూ... విద్యార్థులు పాఠశాల బస్సులు, వాహనాలు ఎక్కేటప్పుడు సురక్షితమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వాహనదారుడు క్షేమంగా ఉంటేనే అతని కుటుంబం సంతోషంగా ఉంటుందని అన్నారు. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో వెళ్లేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, బంధువులకు వివరించి చెప్పాలని కోరారు. అత్యవసర సమయాల్లో 112 నంబర్‌కు డయల్ చేయాలని తెలిపారు. చిన్నారుల అభ్యర్థన మేరకు వాహనదారులంతా రోడ్డు భద్రతా నియమాలను విధిగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లతిక, స్కూల్ ఇంచార్జ్ నరిగే విజయ్, హెడ్ కానిస్టేబుల్ జగదీశ్వర్, హోమ్ గార్డ్ రాము తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

**నల్గొండ కిసాన్ మహాసభలను విజయవంతం చేయాలి**

**బోనకల్‌లో సీపీఎం మధిర డివిజన్ విస్తృతస్థాయి సమావేశం**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 11 (దేశ టైమ్స్):**

రైతుల హక్కుల సాధన కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు పిలుపునిచ్చారు. బోనకల్ మండల కేంద్రంలోని వి.వి.ఆర్. ఫంక్షన్ హాల్‌లో జరిగిన సీపీఎం మధిర డివిజన్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 15న నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగే ఆలిండియా కిసాన్ జాతీయ మహాసభల బహిరంగ సభకు మధిర డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో రైతులను సమీకరించాలని కోరారు. రైతాంగ సమస్యలపై గత మూడేళ్లుగా నిర్వహించిన ఉద్యమాలు, వాటి ద్వారా సాధించిన విజయాలను మహాసభల్లో సమీక్షించనున్నట్లు తెలిపారు. రాబోయే మూడేళ్లలో రైతుల ఆర్థిక అభివృద్ధి, వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన పోరాటాలపై కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు.

**రైతాంగ పోరాటాల చరిత్రను మరువకూడదు:**

తెలంగాణలో పేద రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొన్న దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన రైతాంగ సాయుధ పోరాటం చారిత్రాత్మకమైనదని నాయకులు పేర్కొన్నారు. 1948--1952 మధ్య భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన పోరాటంలో పేదలు పెద్ద ఎత్తున భాగస్వాములయ్యారని తెలిపారు. జమీందారీ, పటేల్, పట్వారీ వ్యవస్థలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం ద్వారా పేదలకు లక్షల ఎకరాల భూమి దక్కిన విషయాన్ని గుర్తు చేశారు.

**ఏచూరి వర్ధంతి సెమినార్‌కు తరలిరావాలి:**

సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 12న ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశానికి దొండపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణ వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. పార్టీ నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ, ఎర్ర శ్రీనివాస్‌రావు, పాపినేని రామనరసయ్య, జొన్నలగడ్డ సునీత, పయ్యావుల ప్రభావతి, నవతెలంగాణ జిల్లా మేనేజర్ ఎస్.డి. జావీదు, జిల్లా సర్క్యులేషన్ ఇన్‌చార్జి ఇరుగు వెంకటేశ్వర్లుతో పాటు వివిధ మండలాల సీపీఎం కార్యదర్శులు, కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# అంగన్వాడీ టీచర్‌తో అసభ్య ప్రవర్తనపై ఎంపీ అర్వింద్ ఆగ్రహం

**బాధితురాలికి ఫోన్‌లో పరామర్శించిన ఎంపీ -- ఘటనపై విచారం, క్షమాపణలు**

జగిత్యాల: జగిత్యాల పట్టణంలో అంగన్వాడీ టీచర్‌తో భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్ అసభ్యంగా ప్రవర్తించారంటూ వచ్చిన ఆరోపణలపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రంగా స్పందించారు. మహిళా ఉద్యోగి పట్ల అనుచిత ప్రవర్తనకు తావు లేదని, ఇటువంటి ఘటనలను పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించదని ఎంపీ స్పష్టం చేశారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేసిన ఎంపీ అర్వింద్, బాధిత అంగన్వాడీ టీచర్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. జరిగిన పరిణామాల పట్ల తన తరపున క్షమాపణలు తెలియజేస్తూ, బాధితురాలికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంగన్వాడీ టీచర్‌తో పాటు ఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన తోటి అంగన్వాడీ టీచర్లను కూడా ఎంపీ అభినందించారు. ఉద్యోగులు తమ విధులను స్వేచ్ఛగా, గౌరవప్రదమైన వాతావరణంలో నిర్వహించేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అదేవిధంగా, ఈ వ్యవహారంలో అంగన్వాడీ సూపర్వైజర్‌ను కూడా బెదిరించినట్లు వచ్చిన ఆరోపణలను ఎంపీ తీవ్రంగా పరిగణించారు. ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకుని, బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా మాట్లాడతామని ఎంపీ అర్వింద్ హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీకనుగుణంగా ఘటనను రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్ రావు, జిల్లా ఇంచార్జ్ శ్రీనివాస్ ల దృష్టికి తీసుకెళ్లి పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళా ఉద్యోగుల గౌరవం, భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఎంపీ స్పష్టం చేశారు. పార్టీకి చెందిన వ్యక్తి అయినా, ఇతరులైనా చట్టానికి ఎవరూ అతీతులు కాదని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధిత అంగన్వాడీ టీచర్, తనకు ఫోన్ చేసి ధైర్యం చెప్పడంతో పాటు ఘటన పట్ల విచారం వ్యక్తం చేసి క్షమాపణలు కోరిన ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అండగా ఉంటామని భరోసా ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం/అధికారికంగా నిర్వహించాలని బిజెపి వినతిపత్రం

**రుద్రంగి సెప్టెంబర్ 11 ( దేశ టైమ్స్)**




రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు కర్ణావత్తుల వేణు ఆధ్వర్యంలో తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినోత్సవం(సెప్టెంబర్ 17) ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణ ప్రజలు విమోచనం పొందిన రోజు సెప్టెంబర్ 17, 1948. ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్ లో విలీనం అయ్యిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు గడుస్తున్నా తెలంగాణ విమోచన దినోత్సవన్నీ అధికారికంగా నిర్వహించాలేక పోవడం బాధాకరమని అన్నారు. గత బిఆరెస్ ప్రభుత్వం విమోచన దినోత్సవన్నీ అధికారికంగా నిర్వహించలేదు కాబట్టి ప్రజలు ఓడించారని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే తీరును అనుసరిస్తుందని కాంగ్రెస్ పార్టీకి కుడ ప్రజలు తగ్గిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జాతీయ జెండాకు సెల్యూట్ చేయని ఒవైసీని నిఖార్సయిన దేశభక్తుడు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంభోదించాడాన్ని ఖండించారు. తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో, ఉపాధ్యక్షుడు గండి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మాల్యాల శ్రీనివాస్, బలగం శ్రీదర్, కాసోజి వంశీ, మోతె నితిన్, పందుగ గంగాధర్, రచకొండ గంగనర్సయ్య, జనార్దన్, సాగర్, పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంభానికి ఆర్థిక సాయం అందజేసిన వాకిటి

**వలిగొండ : సెప్టెంబర్ 11( దేశ టైమ్స్)**



మండల సీనియర్ రిపోర్టర్ ఆలకుంట్ల కృష్ణ మాతృమూర్తి ఆలకుంట్ల మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెముడాల అనిత నర్సింగ్ యాదవ్, బొడ్డు వెంకటరమణ రెడ్డి, వలిగొండ పీఏసీఎస్ డైరెక్టర్ కల్కూరి చంద్రయ్య, ఉప సర్పంచ్ బూడిద నాగరాజు, శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ గంజి అశోక్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు చెవ్వ మధు ముదిరాజ్, వార్డు సభ్యులు ఉక్కుర్తి పద్మ నరసింహ, నిమ్మల వెంకటయ్య, పోలేపల్లి ప్రభాకర్, మారబోయిన మత్స్యగిరి, గంగదారి అశోక్, ఉకుర్తి శీను, బోదాసు దుర్గయ్య, పిట్టల వెంకన్న, ఆలకుంట్ల రాములు, బూడిద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా బెల్లంకొండ సంగీత

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 11 (దేశ టైమ్స్):**



బీజేపీ మహిళా మోర్చా ఖమ్మం జిల్లా కార్యదర్శిగా బెల్లంకొండ సంగీత నియమితులయ్యారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మహిళల సమస్యల పరిష్కారం, వారి హక్కులు, భద్రత, సాధికారత కోసం కృషి చేస్తానని ఆమె తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలను పార్టీతో మరింతగా అనుసంధానం చేస్తానన్నారు. మహిళా మోర్చాను బలోపేతం చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు బాధ్యత అప్పగించిన రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకత్వానికి, మహిళా మోర్చా నాయకులకు, కార్యకర్తలకు సంగీత కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు, మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు ఆమెకు అభినందనలు తెలిపారు.

RNI NO . TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

**వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించాలి**

**సోషల్ మీడియాలో నేరపూరిత సందేశాలపై అప్రమత్తంగా ఉండాలి**

**తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిషోర్**



**దేశ టైమ్స్‌మహబూబాబాద్/మరిపెడ, సెప్టెంబర్ 11:**

పండుగలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలని తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిషోర్ సూచించారు. రాబోయే వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కృష్ణ కిషోర్ మాట్లాడుతూ భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. అన్ని మతాల పండుగలను పరస్పర గౌరవం, సోదరభావంతో జరుపుకోవడం మన సంప్రదాయమని పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. పండుగ సమయంలో ఊరేగింపులు, మండపాల వద్ద ఇతరులకు ఇబ్బంది కలగకుండా నిబంధనలు పాటించాలని సూచించారు. ఇతర మతాల మనోభావాలను గౌరవిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పండుగను నిర్వహించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వచ్చే సందేశాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. సామాజిక మాధ్యమాల్లో కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా నేరపూరిత సందేశాలు, పోస్టులు, వీడియోలు కనిపిస్తే వాటిని ఫార్వర్డ్ చేయకుండా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. తప్పుడు సమాచారాన్ని నమ్మి ఇతరులకు పంపడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పండుగల సమయంలో ప్రజల భద్రతకు పోలీసులు అవసరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. శాంతియుత వాతావరణాన్ని కొనసాగించడంలో అన్ని మతాల పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత కీలక పాత్ర పోషించాలని డీఎస్పీ కృష్ణ కిషోర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మరిపెడ సీఐ పవన్ కుమార్, ఎస్సైలు గండ్రాతి సతీష్, మహబూబి, ప్రభాకర్ రెడ్డితో పాటు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనులను తక్షణమే కల్పించాలి

- కరెంటు కోతలు నివారించి 24 గంటల నాణ్యమైన విద్యుత్తును అందించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అల్వాల వీరయ్య మండల నాయకులు బాణాల రాజన్న డిమాండ్



**దేశ టైమ్స్ మహబూబాబాద్/మరిపెడ సెప్టెంబర్ 11**

వ్యవసాయ కార్మికులకు గ్రామీణ పేదలకు విబిజీ రాంజీ ఉపాధి హామీ పనులను వెంటనే కల్పించి వలసలు నివారించి పేదలను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అల్వాల వీరయ్య మండల నాయకులు బాణాల రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సెప్టెంబర్ 11న పురుషోత్తయగూడెం గ్రామ శాఖ సమావేశం పిట్టల పద్మ అధ్యక్షతన జరిగింది సమావేశంలో వీరయ్య మాట్లాడుతూ వర్షాలు లేకపోవడంతో రైతాంగం వేసిన వివిధ రకాల పంటలు ఎండిపోతున్నాయని దీంతో వ్యవసాయ కార్మికులకు గ్రామీణ పేదలకు పనులు లేక వలస పోతున్నారని వెంటనే వివిజి రాంజీ ఉపాధి హామీ పనులు కల్పించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు కరెంటు కోతలతో రైతులు అవస్థలు పడుతున్నారని కరెంటు కోతలు నివారించి నాణ్యమైన 24 గంటల విద్యుత్తును సప్లై చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఆందోళన పోరాటం నిర్వహిస్తామని వారన్నారు ఈ సమావేశంలో గ్రామ శాఖ సభ్యులు పిట్టల పద్మ కంచు గట్ల పిచ్చయ్య వల్లపు భద్రమ్మ అల్వాల విజయ అనసూయ యశోద అరుణ శ్రీలత తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ వైద్యానికి కొత్త బలం.. ఖమ్మం సర్వజనాసుపత్రిలో విస్తరిస్తున్న ఆధునిక సేవలు











**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 11 (దేశ టైమ్స్):**

ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ఆధునిక వైద్య సేవలు విస్తరిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ప్రత్యేక పర్యవేక్షణతో వైద్య పరికరాలు, రేడియాలజీ సేవలు, మాతా శిశు సంరక్షణ సదుపాయాలను బలోపేతం చేస్తున్నారు. రాష్ట్ర మంత్రుల ప్రత్యేక శ్రద్ధతోనూ ఆసుపత్రిలో సౌకర్యాల విస్తరణకు ఊతం లభిస్తోంది.ఆసుపత్రిలో ఇప్పటికే మూడు పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. అత్యవసర, కదలలేని రోగులకు పడక వద్దే ఎక్స్‌రే చేసే సదుపాయం కూడా ఉంది. కలర్ డాప్లర్, కాంట్రాస్ట్ సీటీ, హెచ్‌ఆర్ సీటీ వంటి అధునాతన నిర్ధారణ సేవలు అందుతున్నాయి.త్వరలో ఎంఆర్ఐ సేవలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు అవసరమైన సివిల్ పనులు, విద్యుత్ సౌకర్యాల ఏర్పాటును వేగవంతం చేస్తున్నారు. ఎంఆర్ఐ అందుబాటులోకి వస్తే మెదడు, వెన్నెముక, కీళ్లు, అంతర్గత అవయవాలకు సంబంధించిన వ్యాధులను గుర్తించేందుకు ప్రజలకు మరింత మెరుగైన అవకాశం లభించనుంది.

**8 నెలల్లో 13,816 అల్ట్రాసౌండ్ పరీక్షలు**

2026 జనవరి నుంచి ఆగస్టు వరకు సర్వజనాసుపత్రిలో 13,816 అల్ట్రాసౌండ్ స్కాన్లు నిర్వహించారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఇదే కాలంలో 16,961 స్కాన్లు జరిగాయి. ఇందులో 8,945 ఓబీజీ, 5,417 ఉదర భాగం, 546 టిఫ్ఫా, 2,053 చిన్నారుల స్కాన్లు ఉన్నాయి.గర్భిణీలకు అందిస్తున్న టిఫ్ఫా స్కాన్ ద్వారా గర్భంలోని శిశువు అవయవాల అభివృద్ధి, ఆరోగ్య పరిస్థితిని ముందుగానే తెలుసుకునే అవకాశం ఉంది. ఈ సేవ ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రైవేటు వైద్య ఖర్చుల భారం తగ్గుతోంది.రేడియాలజీ విభాగంలో నిపుణుల సేవలను పెంచేందుకు చర్యలు చేపట్టారు. డాక్టర్ సురేందర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరగా, మరికొంతమంది వైద్య నిపుణులను అందుబాటులోకి తీసుకువచ్చే చర్యలు కొనసాగుతున్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాళీల భర్తీకి కూడా చర్యలు చేపడుతున్నారు.కొత్త పరికరాలు తీసుకురావడంతో పాటు వాటి ద్వారా నిరంతర వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. అధునాతన పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులోకి రావడంతో ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గి, పేద ప్రజలకు ఆర్థిక భరోసా లభిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

# నర్సంపేటలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీల ధర్మ పోరాట దీక్ష

- దీక్షలో పాల్గొన్న వరంగల్ జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, ఓబీసీ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతి

వరంగల్ జిల్లా నర్సంపేటలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఇచ్చిన పిలుపు మేరకు బీసీ సంక్షేమ సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల ధర్మ పోరాట దీక్ష కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, ఓబీసీ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతి లు హాజరై మహనీయులు మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రి బాయి దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగే జనగణలో బీసీ కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 2025 మే నెలలో నిర్ణయం తీసుకున్నారు. అప్పుడు తీసుకున్న నిర్ణయాన్ని తుంగలో తొక్కి కులగణన శాస్త్రీయమైన పద్ధతిలో చేయకుండా దేశ వ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో ఓబీసీ కాలం చేర్చకుండా బీసీ కాలం లేకుండా, బిసీలకు అన్యాయం చేసిందని అన్నారు. రెండవసారి ఈ సంవత్సరం ఆగస్టు 17వ తేదీ నుండి జాతీయ జనగణన ప్రారంభించి కేంద్ర ప్రభుత్వం బీసీలను మళ్లీ మోసం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం జన గణనలో బీసీ కులాలకు ప్రత్యేక కాలం ఏర్పాటు చేసి బీసీల జనాభాను లెక్కించాలని అన్నారు దేశ జనాభాలో అత్యధిక ఉన్న బీసీ ఓబీసీ కుటుంబాల విరాళం వివరాలను ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు బీసీల జనాభా ఎంత ఉందో గణాంకాలు లేకపోతే జనాభా ప్రాతిపదికన విద్య ఉద్యోగం సంక్షేమ పథకాలు రాజకీయ ప్రాతినిధ్యం లో సరైన మాట ఎలా నిర్ణయించగలరు అని అన్నారు లేకపోవడం వల్ల బీసీలు సామాజిక ఆర్థిక విద్య మరియు రాజకీయ రంగాల్లో వెనుకబడే ప్రమాదం ఉందని కావున దేశవ్యాప్తంగా చేపడుతున్న జనగణలో ఓబీసీలకు ప్రత్యేక కాలం ఏర్పాటు చేసి కులగలను చేయాలని డిమాండ్ చేశారు. దీక్ష అనంతరం బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు బొనగాని రవీందర్, బి ఆర్ పి పార్టీ రాష్ట్ర నాయకులు బుర్రి సాగర్ లు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి పార్టీ జిల్లా అధ్యక్షుడు వనం మహేందర్, బి ఆర్ పి పార్టీ రాష్ట్ర నాయకులు బుర్రి సాగర్, సిపిఎం పార్టీ నాయకులు అనంతగిరి రవి, బహుజన నాయకులు ఈదుల కృష్ణ, జన్ను రవి, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శులు మారబోయిన రాములు యాదవ్, సంగెం రమేష్, చీకటి ఓదేలు, బొనగాని రవీందర్, జిల్లా యూత్ అధ్యక్షుడు కదారి సురేష్ యాదవ్, పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య, చెన్నారావుపేట మండల మహిళా అధ్యక్షురాలు బండి విజయ, దుగ్గొండి మండల కార్యదర్శి మోకిడే శ్రీకాంత్, మండల నాయకులు జినుకల కనుకమల్లు, ముదిరాజ్ సంఘం నాయకులు జినుకల కొమ్మాలు ముదిరాజ్, బీసీ నాయకులు కోండ్రోజు శ్రీనివాస్, కుండె రాజ్ కుమార్ యాదవ్, మేరుగు శంకర్ లింగం, వడిచర్ల రమేష్, ఓడపెల్లి గోవర్ధన్ లతో పాటు మహిళలు పాల్గొన్నారు.



Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280